# తేనీరు-కన్నీరు

## తాళ్లూరు నాగేశ్వరరావు




సూర్యుని చుట్టూ చేరిన సాయంత్రపు మబ్బులు ఎర్రగా నవ్వుతున్నాయి, నెత్తురు కక్కుతూన్నట్టు. ఆ నవ్వులో ఏదో తీవ్రత, కసి, ప్రతీకార జ్వాల, జుగుప్స! ఎందుకో-అనుకున్నాడు దేవ్, క్రీమ్ వైట్ టాప్‌గల మెరూన్ కలర్ ప్రీమియర్ పద్మినీ స్పెషల్‌ను కులాసాగా డ్రైవ్‌చేస్తూ.

నగర వైభవానికి ప్రతీకగా నిల్చే ఆధునిక భవనాల సమూహంగల ఆకాలనీ రోడ్డు సౌందర్య గర్వంతో విర్రవీగుతోండగా, ఏ ఇంటి కా ఇంట్లో స్వకీయ స్వర్గాన్ని సృష్టించుకొని, లోకంతో తమకేమి నిమిత్తం అన్న నిర్లక్ష్యం కాబోలు, జనసంచారం అట్టే లేదు-రోడ్డుకు కుడి పక్కనగల పాన్‌షాపు దగ్గర ముగ్గురు మనుషులూ, ఎడంపక్కన కూరగాయల తోపుడుబండి దగ్గర ఇద్దరు స్త్రీలూ మినహాయించి.

సంధ్యాకాళం నెత్తురు కక్కుతూన్నా, దేవ్ మనసుమాత్రం వెన్నెల వాళ్ళు విరుచుకున్నట్టుంది. ఆ కాలనీలో వున్న ఓ మిత్రుని దగ్గరకు బయల్దేరాడు - ఆఫీసు విడిచిపెట్టాక కార్లూ, కార్ల స్పేర్ పార్టులూ డీల్‌చేసే ఓ పెద్ద ఆటో మొబైల్ కంపెనీలో ఎడ్మినిస్ట్రేటివ్ ఎగ్జిక్యూటివ్ అతను. ఆ కంపెనీ హెడ్డాఫీసు హైదరాబాదులో వుంది. సికిందరాబాద్‌లో ఓ బ్రాంచి ఆఫీసు వుంది. లిమిటెడ్ కంపెనీ అయినా దాని బిజినెస్ టర్నోవర్ 'ల'కారం దాటి 'కో' స్థానాన్ని ఆక్రమించగా, దాని వ్యాపార పేరు ప్రతిష్ఠలు ఆంధ్రప్రదేశ్‌లో హోల్ మొత్తం విస్తరించాయి. అందుకు ముఖ్య కారణం అలహాబాద్ బిజినెస్ మేనేజిమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఎం.బి.ఏ. ఫస్ట్ క్లాస్ డిస్టింక్షన్‌తో పాసై, మేనేజిమెంట్ టెక్నిక్స్‌లో కొత్త పోకడలను అవలంబించి, డైనమిక్ యంగ్ ఎగ్జిక్యూటివ్‌గా అందరి మెప్పూ పొందిన దేవ్ ఎడ్మినిస్ట్రేటివ్ సామర్థ్యమేనని అంటారు.

దేవ్ వయస్సు మూడు పదులకు మించలేదు. అయితే ఇంకా పెళ్ళి చేసుకోలేదు. 'ఎందుకు చేసుకోలేదు?' అన్న ప్రశ్నకు ఎవరికి వారు తమకు తోచినట్టు సమాధానాలు చెప్పుకున్నా దేవ్ మటుకు దోరపండులాంటి దరహాసంతో 'ఇంకా ఆ సమయం ఆసన్నం కాలేదు' అంటూ వుంటాడు. వివాహానికి అతడ్ని సుముఖంగా చేయాలనే పట్టుదలతో చాలా మంది చాలా రకాలుగా ప్రయత్నించారు. కాని అతను ఎవ్వరికీ చోటుపెట్టలేదు. తన ధ్యేయాన్ని వెల్లడించలేదు. అయినా అతనిమీద ఆశలు పెట్టుకొని, ఆ ఆశల దీపాలకు నిత్యమూ నూనె పోస్తున్న వారు చాలామంది లేకపోలేదు.

అందులో ఆశ్చర్యమేముంది?

దేవ్‌ది ప్లీజింగ్ పర్సనాలిటీ. పదహారునుంచి నలభై ఆరేళ్ళ వయస్సులో వున్న ఏ స్త్రీ అయినా పడిచచ్చే ఆకర్షణ అతని పర్సనాలిటీ ప్రత్యేకత. బంగారు పళ్లెంపై సంధ్యాకాంతి పడినప్పటి ఛాయ; ఆత్మశక్తికి ప్రతీకగా ముందుకు వొంగిన ముక్కు, పట్టపగలే ఆకాశంలో నక్షత్రాల్ని చూడగల వాడిగలకళ్లు, మగసిరికి ఛాలెంజిగా నిల్చిన సొగసైన మీసకట్టు; మనోధైర్యానికి మారుపేరు అనిపించే నుదురు; ఆ నుదురుపై తీర్చిదిద్దిన జీవితంపట్ల ఏమాత్రం ఆలోచన లేనట్లుండే సరదా అయిన, బిరుసైన, అక్క-

డక్కాడా ఫుంగరాలు తిరిగిన జుత్తు; గర్భగుడి తలుపుల్ని స్ఫురణకు తెచ్చే బలమైన ఛాతీ; పొడుగైన, దృఢమైన బాహువులు-ప్రబంధ శృంగార నాయకుని లక్షణాలన్నీ అతనిలో పూర్తిగా మూర్తీభవించి వున్నాయా అనిపిస్తుంది. అయితే దేవ్ మోడరన్ హి-మాన్. జపాన్ నిఖెడ్ వైట్ బెల్‌బాటమ్ ప్యాంటుమీద, ఎల్లో గ్రీన్, రెడ్ మిక్స్‌డ్ కలర్‌తో 'డ్రాగన్' ప్రింటెడ్ సింగపూర్ టీ షర్టు ధరించి 'ఈవెనింగ్ ఇన్ హాంకాంగ్'ను జ్ఞప్తికి తెస్తూ, యెంతో స్మార్ట్‌గా ఉన్నాడు.

పట్టు తివాచీపై రబ్బరుబంతి జారి పోతున్నట్టుగా రోడ్డుమీద పోతోంది ప్రీమియర్ పద్మినీ.

రోడ్డుకు అటూ యిటూ వున్న రకరకాల కొత్త బిల్డింగుల వైభవాన్నీ, ఆర్కిటెక్చర్ అందాలనూ, కలర్ కాంబినేషన్ సోయగాలనూ, మధ్య మధ్యలో దిష్టిబొమ్మల్లా వున్న పాడుబడ్డ పెంకుటిళ్ళనూ చూసుకుంటూ తాపీగా కారు నడుపుతున్నాడు దేవ్ ఇరవై కిలోమీటర్ల స్పీడులో, థర్డ్ గేర్‌లో.

సాయంత్రపు సూర్యుని కిరణాలు సూటిగా ముందు అద్దంపై బడి గ్లేర్ కొడుతున్నాయి.

ట్రాఫిక్ అట్టే లేదు.

నీగ్రో స్త్రీ బుగ్గలా మెరుస్తోంది తారురోడ్డు.

దేవ్ ఏదో ఆలోచిస్తున్నాడు....

అతని చేతులు స్టీరింగ్‌మీదున్నాయి.

కుడికాలు యాక్సిలేటర్‌మీదా, ఎడంకాలు క్లచ్ పక్కనా....

—యాంత్రిక ధర్మం ప్రకారం కారు పోతూనే వుంది.

* * *

సడెన్‌గా బ్రేకు ఘీంకారం; అందులో కల్సిపోయిన ఓ మూడేళ్ళ పాప పొలికేక.

దూరంగా తల్లి ఆర్తనాదం.

చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు పరుగు పరుగున వచ్చి చుట్టుముట్టారు.

- కారు కుడిచక్రంకింద ఓ మూడేళ్ళ పసిపాప నెత్తురు ముద్దై పడిపోయివుంది.

దేవ్ గుండెలో భయం కత్తిలా దిగింది. వొళ్ళంతా స్వేదంతో నానిపోయింది. వూపిరి ఆగినంత పనైంది. అయినా అంతలోనే తమాయించుకున్నాడు తెగింపులాంటి ఆత్మస్థైర్యంతో.

కారు దిగి చూశాడు దేవ్.

దగ్గరి పెంకుటింట్లోంచి గుండెలు బాదుకుంటూ పరుగెత్తుకొచ్చిన ఆ పిల్ల తల్లి, ఆ నెత్తురు ముద్దను ఒళ్ళోకి తీసుకొంది. ఆమె తెల్లని చీరంతా రక్తంతో ఎర్రనెర్రనై, జరిగిన దారుణానికి ప్రత్యక్ష దృష్టాంతంగా నిల్చివుంది. ఆ నెత్తుటి ముద్దను అలాగే భుజంమీద వేసుకొని ఇంట్లోకి తీసుకెళ్ళిందామె. ఆమె వెంట కొంతమంది వెళ్లారు.

కారు రోడ్డుమీద అలాగే వుంది— పట్టుపడ్డహంతకునిలా. ఆకారు పక్కనే దేవ్ శిలాప్రతిమలా నిలబడ్డాడు. అతని మెదడంతా మొద్దుబారిపోయింది. ఆలోచనలు ఆగిపోయాయ్. శరీరమంతా శ్మశాన గంభీరతతో బిగుసుకుపోయింది.

తెల్లగా చిరునవ్వు నవ్వే చంద్రునిపై కారుమేఘం కమ్ముకుంటే—

పచ్చదనపు పరువంతో కులాసాగా తల ఆడించే అరటిచెట్టుపై పిడుగు పడితే—

కోర్కెలు తీరని కోడెవయస్సులో వున్న యువకునికి హఠాత్తుగా హార్ట్ అటాక్ వచ్చి కన్నుమూస్తే—

ఎవరిది తప్పు?

యాక్సిడెంట్‌కు తప్పొప్పులతో నిమిత్తంలేదు. కారణాకారణాలతో సంబంధంలేదు. ఎంత నష్టం జరిగిందనేది ముఖ్యం.

నెత్తురుకక్కిన కర్మసాక్షి నిశ్శబ్దంగా నిష్క్రమించాడు. ఊదారంగు దుస్తుల్ని ధరించిన మబ్బులన్నీవీడ్కోలు ఇచ్చాయి.

మునిమాపు మెల్లగా కనురెప్పలు విప్పింది.

కొన్ని నిముషాలతర్వాత ఆ పిల్ల తల్లి గుమ్మంలోకి వెళ్ళాడు దేవ్, నేరభారంతో తల వంచుకొని. వరండా మెట్లమీద కూర్చుంది ఆమె. ఒళ్ళో చనిపోయిన పిల్ల శవం వుంది. నెత్తురంతా ఇంకిపోయి నల్లబడింది. తల్లి ఏడ్పుకూడా యింకిపోయినట్టుంది, ఏడ్వడంలేదు. ఆమె తల్లి కాబోలు. యాభైయేళ్ళ పైచిలుకు ముసలావిడ, మధ్య మధ్యలో దీర్ఘాలు తీస్తోంది. నలుగురైదుగురు అమ్మలక్కలున్నారు.

'తప్పు నాదే; ఏ శిక్ష విధిస్తే ఆ శిక్షను అనుభవించడానికి ఆజీలుగా వున్నాను,' అని ఆ పిల్ల తల్లితో చెప్పడానికి వచ్చాడు దేవ్. కాని గుండెకోతతో, నిండు దుఃఖంతో వున్న ఆమెతో ఎట్లా మాట్లాడడమో అతనికి తెలియలేదు. నిశ్శబ్దంగా నిలబడ్డాడు.

అక్కడ వున్నవాళ్ళంతా అతనికేసి వింతగా, రోతగా, కసిగా, జాలిగా, నిర్దాక్షిణ్యంగా చూశారు. ఆ చూపుల్ని భరించాడు దేవ్. తప్పు తనదైనప్పుడు, లోకానికి తలవంచడం తన కర్తవ్యం అనే తత్వంగలవాడతను.

"ఆయన్ను వెళ్ళమనిచెప్పు"అందామె ఎదురుగ్గావున్న ఓ పన్నెండేళ్ళ పిల్లతో, అంత దుఃఖంలోనూ వర్తమాన కర్తవ్యాన్ని గుర్తించి.

చివుక్కున తలెత్తి ఆమెకేసి చూశాడు దేవ్.

ఆమె తలదించుకొని క్షణంలో శవంగా మారిన కూతురుకేసి చూడసాగింది నిర్వికారంగా.

అక్కడున్నవాళ్ళంతా ఆమె ఉన్నత

క్షమాగుణానికీ, హృదయ వైశాల్యానికీ మానవత్వపు ఔన్నత్యానికి ఆశ్చర్యపోయి, ఒకరిముఖా లొకళ్ళు చూసుకున్నారు.


ఓ నిముషంసేపు దృష్టిని కేంద్రీకరించి ఆమెకేసి చూశాడు దేవ్. ఆమెతో మాట్లాడటానికి అది సమయం కాదనుకున్నాడు. వెంటనే కారెక్కి, ఇంటికెళ్ళాడు.

దేవ్ మనోనేత్రంముందు ఆమె రూపు అనుక్షణమూ మెదులుతూనే వుంది వెంటాడే నీడలాగ. పాతికేళ్ళ లోపు వయస్సు; తెల్ల గులాబీరంగు శరీరఛాయ; కన్నకూతుర్ని కళ్ళముందే పోగొట్టుకున్న దుఃఖం మొహంలో మెరమెరలాడుతూన్నా ఆ మొహంలో ఏదో ఆకర్షణ; కొవ్వొత్తిలా తాను కరిగిపోతూన్నా, ఇతర్లకోసం వెలుగు నివ్వాలనే అపూర్వమైన ఆకాంక్ష ఆ కళ్ళల్లో; కష్టాల ఖార్ఖానాలో జీర్ణించుకున్న అనుభవంతో ఏర్పడిన నిర్లిప్తతతో మిళితమైన ఆమె వ్యక్తిత్వం-అతని మనస్సులో సంఘర్షణ సృష్టిస్తూనే వున్నాయి. ఆ రాత్రి ఎప్పటికోగానీ నిద్రపోలేదు దేవ్.

* * *

మరునాడు ఆలస్యంగా నిద్రలేచాడు దేవ్. నిద్రలేవగానే గత సాయంత్రపు స్మృతులు మనస్సులో తుప్పుకత్తుల్లా విచ్చుకున్నాయి. బెడ్‌మీద కూర్చుండి పోయాడు అయిదు నిముషాలపాటు.

....నిన్న తాను చేసిన కారు హత్యకు తప్పనిసరిగా జైలుకు పోవాల్సి వుండేది. కనీసం ఆర్నెల్లు! ఆ జైలుశిక్ష తన జీవితానికి మాయని మచ్చగా మిగిలిపోయేది; తన భవిష్యత్తుపై చీకటి తెరను శాశ్వతంగా దించి వుండేది! తనని ఎంత గొప్ప ప్రమాదంనుంచి ఆమె తప్పించింది? నిజంగా తాను ఆమెకు జీవితాంతమూ కృతజ్ఞుడుగా వుండాలి! ఆమె




ఉదారత్వం ఆధారంగానే తాను ఈ క్షణంలో నిశ్చింతగా వున్నాడు. కాని ఆమె జన్మదుఃఖానికి తాను కారణభూతుడయ్యాడు. తాను చేసింది క్షమించరాని నేరం! భగవంతుడొక్కడే ఆ నేరాన్ని క్షమించాలి. కారణం—తాను బుద్ధిపూర్వకంగా ఆ నేరానికి పాల్పడలేదు. పొరబాటు జరిగింది. అయితే ఆ పొరబాటు మానవమాత్రుల క్షమింపుకు అర్హమైంది కాదు. ఆమె ఎవరో తనపాలిట ప్రత్యక్ష దేవత! ....కాని ఆ ప్రమాదం సొంతం తప్పిపోయినట్టేనా? ఆమె భర్త వచ్చి ఏమన్నాడు? అతను తన నేరాన్ని క్షమిస్తాడా? ఒక మగవాడ్ని స్త్రీ క్షమించినంత సులభంగా మరో మగవాడు క్షమించగలడా?....

ఆ భావన రాగానే దేవ్ మనస్సు మళ్ళీ పచ్చిపుండులాగైంది. కొత్త భయాలు జడలు విప్పుకున్నాయి.

ఆరోజు ఆఫీసుకు వెళ్ళలేదు దేవ్. తొమ్మిది గంటలకు ఫోన్‌చేసి చెప్పాడు-వొంట్లో బావుండలేదనీ, ఆఫీసుకు రావడంలేదని. అతను ఆ ఫోను అట్లా పెట్టగానే కుక్ కమ్ పనిమనిషి అంజనేయులు వచ్చి— "సార్! మీకోసం ఎవరో వచ్చారు!" అన్నాడు.

దేవ్ గుండెలో బాంబ్ పేలినట్లయింది. ఆ వచ్చింది ఆమె భర్త కాదు గదా! తన ఖర్మగాలి అతనే అయితే తాను ఏంచేయాలి? ఎంత డబ్బు అడిగితే అంత యిచ్చి, కేసు లేకుండా చేసుకోవడమే!

"రమ్మను"అన్నాడు దేవ్ ధైర్యాన్ని పుంజుకుంటూ. డన్‌హిల్ ప్యాకట్లోంచి ఓ సిగరెట్టు తీసి, లైటర్‌తో వెలిగించి రానున్న ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సిద్ధపడ్డాడు.

"నమస్కారం" అంటూ రెండు చేతులూ గుమ్మంలోనే ఎత్తి, చిరునవ్వును హారతిగా పట్టి, సవినయంగా వచ్చి ఎదురుగ్గా నిలబడ్డాడు ఓ ఇరవై ఎనిమిదేళ్ళ యువకుడు.

"రండి, కూర్చోండి"అన్నాడు దేవ్.

సగటు ఒడ్డూ, పొడవులతో, చామన ఛాయతో, చెంపలు దిగిన పట్టీలతో, నుదురును సగం కప్పిన క్రాపుతో, ఇటుకరాతి రంగు టెర్లిన్ షర్టును, వైట్ డ్రిల్ ప్యాంటులో దిగేసి, జీవితానికి ఏదో అదృష్టం హఠాత్తుగా పట్టిన ఆనందాన్ని మొహానికి పౌడరుగా పులుముకొని ఎదురుగ్గా సోఫాలో కూర్చున్నాడు.

'ఎవరు మీరు?' అనకుండానే, తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"నాపేరు శివరాం. సికింద్రాబాద్‌లో

ఓ ఫర్టిలైజర్ కంపెనీలో స్టెనోగా పని చేస్తున్నా. తమ పేరు ప్రఖ్యాతులు వినడమేగానీ, తమను ప్రత్యక్షంగా దర్శనం చేసుకొనే భాగ్యం ఇప్పటికిగానీ కలగలేదు. జీవితంలో నేను ఆశించని, వూహించని, జీవితాంతమూ జ్ఞాపకం పెట్టుకోదగ్గ ఓ గొప్ప సహాయం చేశారు నాకు మీరు. అందుకు ధన్యవాదాలు చెప్పుకుందామని వచ్చాను, అడ్రసు ప్రకారం మీ ఇల్లు వెదుక్కుంటూ."

అతని మాటలు ఆకాశమంత అయోమయంగా కనబడ్డాయి దేవ్‌కు. అతగాడ్ని అంతకు ముందెప్పుడూ చూడలేదు అతనికి తాను అంత గొప్ప సహాయం చేయడమేమిటి?

"నాకు మీరు చేసిన సహాయం పరోక్షమైంది. అందుచేత మీకు అయోమయంగా వుండొచ్చు. అరటిపండు వొలిచి అరచేతిలో పెట్టినట్టు చెబుతాను, వినండి. నిన్న సాయంకాలం మీ కారుకింద ఓ మూడేళ్ళ పిల్లపడి, 'అమ్మా!' అనకుండానే అసువులు బాసింది చూశారూ! ఆ పిల్ల నా పాలిట శనిగ్రహం! ఆ గ్రహం పీక తప్పించి, నా ప్రాణంపై పన్నీరు చల్లారు. అదెట్లా అంటారేమో! వినండి. ఆ పిల్ల తల్లిపేరు సునీత. సికింద్రాబాద్‌లో ఓ కంపెనీలో పని చేస్తుంది. రోజూ ఉదయం ఇద్దరం ఒకే బస్సులో వెళతాం. సాయంత్రం ఒకే బస్సులో వస్తాం. మా ఇరువురిమధ్య ప్రేమ స్టార్ట్ కావడానికి బస్‌స్టాప్ మంచి సాధనమైంది. ఆ ప్రేమ చిగుళ్ళుతొడిగి, పచ్చగా పెరిగి, మొగ్గలు వేయడానికి అర్థసంవత్సరం పట్టింది. అయితే సంవత్సరమైనా ఆ మొగ్గలు విచ్చుకోవడంలేదు."

శివరాం మాటల్ని కుతూహలంగా వినసాగాడు దేవ్.

అంతలో ఆంజనేయులు రెండు కప్పుల కాఫీని ట్రేలో పట్టుకొచ్చాడు. ఓ కప్పు అందుకొని మూడుగుక్కల్లో గొంతులో పోసుకొని, దేవ్ యిచ్చిన డన్‌హిల్ సిగిరెట్టును వెలిగించి, రెండు పీల్పుల్లో సగం సిగరెట్టును కాల్చి— "ఇది సీమసరుకులాగా వుందే! రుచి వుంది గానీ, ఘాటుసున్నా. నా బోటి చార్మినార్ గాళ్ళకు, ఈ సిగిరెట్లు గోగుపుల్లలు" అన్నాడు శివరాం.

దేవ్ కాఫీ తాగాడు. అతను కాఫీ త్రాగుతూన్నంతసేపూ సిగిరెట్ పీల్చడంలో విశ్రాంతి తీసుకున్నాడు శివరాం.

దేవ్ సిగిరెట్ ముట్టించడంతో, మళ్ళీ ప్రేమాయణం ప్రారంభించాడు శివరాం.

"మా ప్రేమ మొగ్గలదగ్గరే ఆగిపోవడానికి కారణం మీ రూహించారా? లేదు. ఆ పిల్లే! ఆ పిల్ల పుట్టడంతోనే పుట్టెడు దురదృష్టంతో పుట్టింది. శాపగ్రస్తురాలు. నిన్న సాయంత్రం మీ కారు పుణ్యంవల్ల ఆ శాపాన్నుంచి విముక్తురాలైంది. ఇదంతా మీకు కలగూరగంపలో కొతిమీరలాగ గందరగోళంగా వుండొచ్చు. అసలు పాయింటు చెప్పి, మీ మనస్సు క్లియర్ చేస్తాను. సునీతకు అసలు పెళ్ళికాలేదు. కాలేజీలో చదివేప్పుడు ఓ క్లాస్‌మేట్‌ను ప్రేమించిందట. పరీక్షలకుముందే ఆ ప్రేమ మైకంలోపడి, ప్రియుడి ప్రమాణాలను నమ్మి, శరీరంపై హక్కుల్ని వొదులుకుందట. ఆ యువకుడు ఈమె వయస్సునూ, లావణ్యాన్నీ, విశ్వాసాన్నీ తనఅనుభవాల ఐశ్వర్యంగా మార్చుకొని, కడకు మోసంచేసి అడ్రసూ, ఆనవాలూ లేకుండా మరోదేశం వుడాయించాడట. బి.ఏ. పరీక్ష ప్యాసైంది. కాని విధి పెట్టిన పరీక్షలో ఘోరంగా తప్పింది. అంతేకాదు. ప్రియునితో కులికిన కాలం ఆమె పాలిట కాలపాశమైంది. ఉద్యోగానికి దరఖాస్తు పెట్టినరోజే కడుపులో తిప్పి, కక్కిందట. ఉద్యోగంలో చేరిన ఆరుమాసాలకే మెటర్నిటీ లీవు తీసుకోవాల్సి వచ్చిందట. గ్రహచారం ఎట్లావున్నా సునీత గుండెధైర్యం గాండీవంలాంటిది. ప్రియుడు మోసంచేసినా, ఆ ప్రియుడు తన గర్భంలో పెరుగుతూన్న పాపానికి హేతువైనా, గర్భస్రావానికి ఒప్పుకోలేదు. లోకుల నవ్వులకు తడబడలేదు. నవమాసాలు మోసి, బిడ్డను కని తన పోషణలోనే పెట్టుకుంది. మా ఇరువురి మధ్యా ప్రేమ ప్రారంభమై, పరిపక్వదశకు వచ్చింతర్వాతగానీ ఆమె కథ నాకు సొంతం తెలియలేదు. ఆమె చెప్పింది ఆవగింజంత కూడా దాచకుండా. అయినప్పటికీ నేను ఆమెను ప్రేమించాను. ఇద్దరమూ పెళ్ళిచేసుకుందామనే నిర్ణయానిక్కూడా వచ్చాం. పెళ్ళికూడా జరిగిపోవాల్సిందే! కాని జరగలేదు."

'ఎందుకని?' అని దేవ్ ప్రశ్నించక ముందే, ఓ చార్మినార్ సిగిరెట్టు వెలిగించి చెప్పనారంభించాడు శివరాం.

"ఎందుకని అంటారేమో! వినండి, చెబుతాను. పెళ్ళికి నేనో షరతు పెట్టాను. ఆ షరతు సబబైందే. పెళ్ళికి ముందే ఆ పిల్లను ఏ అనాధశరణాలయానికో అప్పజెప్పమని.

దానికామె ఒప్పుకోలేదు. తాను బ్రతికి వుండగా, పిల్లను ఎవరి ఆశ్రయానికో, దయా దాక్షిణ్యాలకో వొదిలివేయడం జరగదనీ, జంతువులు సైతం పుట్టిన సంతానాన్ని ఆప్యాయంగా పెంచుతాయనీ, పెళ్ళికాని తల్లిని సమాజం ఎంత నీచంగా చూసినప్పటికీ, మొండిధైర్యంతో ఆ సమాజాన్ని ఎదుర్కొని, తన బిడ్డను పెంచుతాననీ పట్టుదలతో భీష్మించుకు కూర్చుంది. నలుగుర్నీ కాదని బొమికలు మెడలో వేసుకుని తిరిగే ధైర్యం నాకు లేదు. నా పిరికిదనం, ఆమె పట్టుదల మధ్య మా పెళ్ళి ఆగిపోయింది. ఇప్పుడా అడ్డు

తొలగిపోయింది. అందుకు కారకులైన మీకు ధన్యవాదాలు అర్పిస్తున్నాను."

వానలో ఎండలాగా కన్నీళ్ళ మధ్య చిరునవ్వును దొర్లించినట్టుగా వుంది దేవ్‌కు శివరాం చెప్పిన ధన్యవాదాలు. ఓ రెండు నిముషాలు మౌనంగా ఆలోచించాడు. వ్యక్తిగతమైన జీవిత స్వరూపాలు ఎన్నో రకాలు! ఒకరికి దుఃఖం — మరొకరికి సుఖం; ఒకరికి ఆత్మక్షోభ — మరొకరికి ఆత్మ తృప్తి; ఒకరికి తప్పు—మరొకరికి వరం; ఒకరికి జీవితక్షయం — మరొకరికి జీవితానందం. ఒక దుర్ఘటనలోనే ద్వివిధాలైన ఫలితాలు!

"ఇప్పుడు మిమ్మల్ని సునీత పెళ్ళి చేసుకుంటుందా?" అన్నాడు దేవ్.

"ఎందుకు చేసుకోరు? అడ్డు తొలిగిందిగా! నాలుగు రోజులు పోయాక నేనే ఆ ప్రస్తావన తెచ్చి పెళ్ళికి ఒప్పిస్తాను. ఆమె కోర్కెలున్న మనిషేగానీ, రాయీ రప్పా కాదుగా! మా పెళ్ళికి మీరొచ్చి ఆశీర్వదించాలి" అన్నాడు శివరాం.

నిప్పుపై నీటిచుక్క పడగా, పొగ పైకి లేచినట్లుగా నిట్టూర్పు విడుస్తూ తల ఆడించాడు దేవ్.

సెలవు తీసుకుని, మరో మాటు దణ్ణంపెట్టి వెళ్ళిపోయాడు శివరాం.

* * *

వారం రోజులు గడిచాయి.

దేవ్ మనస్సులో సునీత రూపు సజీవంగానే వుంది. తీరిక వున్నప్పుడల్లా ఆమెను గురించే ఆలోచించసాగాడు. ఆమెకు తాను చేసిన అన్యాయం గురించి క్షమించమని అడిగితేగానీ అతని మనస్సు కుదుటపడేట్టు లేదు.

ఓ సాయంత్రం ఆమె ఇంటికెళ్లాడు దేవ్. కాని ఆమె ఇంట్లో లేదు. నాలుగు రోజుల క్రితమే ఖాళీ చేసి వెళ్ళిందట. ఎక్కడికెళ్లిందో, ఎక్కడ వుంటుందో,




ఏమిటో ఆ పక్కింటివాళ్ళకు తెలియదట. అడ్రసు యిచ్చి వెళ్ళలేదట. నిరాశతో నిట్టూర్పు విడిచి, ఇంటి కొచ్చాడు దేవ్.

ఆ వారం రోజుల్లో శివరాం జాడ కూడా లేదు. సునీత ఎక్కడ వుంటూన్నది అతనికి తెలిసి వుండవచ్చు ననుకున్నాడు. వాళ్లు పెళ్ళిచేసుకున్నారేమో! వేరే కాపుర ముంటున్నారేమో!

రెండు నెలలు గడిచాయి.

ఓ రోజు దేవ్ ఆఫీసులో వుండగా, అతని గదిలోకి టైప్‌చేసిన లెటర్ పట్టు కొచ్చింది సునీత.

ఆమెను చూడగానే అత్యద్భుతంగా ఆశ్చర్యపోయాడు దేవ్. ఆమె మాత్రం అంతగా ఆశ్చర్యపోలేదు.

ఆమె ఇచ్చిన ఫైలు అందుకున్నాడు. కాని అతని చూపులన్నీ ఆమె మీదే నిలిచి వున్నాయి. చిలకపచ్చ రంగు ఆకుల బోర్డర్ గల తెల్లటి ఆర్గండీ చీరె, దానిపై లైట్ గ్రీన్ కలర్ జాకెట్టు ధరించింది. వొదులుగా జడ వేసుకుంది. మొహం ప్రసన్నంగావుంది—ఏ భావానికీ చోటులేకుండా. సంభ్రమాశ్చర్యాలతో కూడిన దేవ్ చూపుల్ని భరిస్తూ నిల్చుంది ఆమె.

"కూర్చోండి" అన్నాడు దేవ్.

కాని ఆమె కూర్చోలేదు.

"కూర్చోండి. మీతో మాట్లాడాలి. నేను కూర్చోమంటే కూర్చోకపోవడం మర్యాద కాదు" అన్నాడు దేవ్.

"నన్ను క్షమించమని అడగటానికి ఆ తర్వాత మీ ఇంటి కొచ్చాను. ఇల్లు మారినట్టు తెల్సింది. నా నేరాన్ని భరించి, నా పరువు ప్రతిష్ఠల్ని కాపాడారు. జీవితంలో మీ కెంతో కృతజ్ఞుడ్ని. మీ హృదయ వైశాల్యం అంచనాకు అందేది కాదు."

పెదవులు కదల్చకుండా చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వులోని విషాదం అతనికి బోధపడింది.

అంతలో ప్యూన్ ట్రేలో రెండు కప్పుల టీ తెచ్చాడు. ఆమె తీసుకోలేదు.

"టీ తీసుకోండి. కన్నీటికి తేనీటికి సానుభూతి కావాలంటారు పెద్దలు."

ఆమె టీ తీసుకుంది.

"అన్నట్టు యీ ఆఫీసులో కొత్తగా జాయిన్ అయ్యారా?"

"ఊఁ! నిన్ననే సికింద్రాబాద్ బ్రాంచి నుంచి ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ చేశారు."

దేవ్ సిగిరెట్టు వెలిగించాడు.

"మిమ్మల్ని గురించి శివరాంగారు

చెప్పారు. మీ ఇద్దరూ త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నారట."

"లేదు."

దేవ్ ఉలిక్కిపడ్డాడు.

"ఏం?"

"సరిహద్దుల చట్రంలో జీవితాన్ని బిగించి, ఆ సరిహద్దుల వలయంలోనే సంతృప్తిని పొందాలనేది ఆయన అభిమతం. నా తత్వం అందుకు ఒప్పుకోదు. నాకు స్వేచ్ఛ ముఖ్యం. నా కాళ్ళ మీద నేను నిలబడగలిగే వ్యక్తిత్వం కోసం పోరాటం సల్పడం నా ధ్యేయం. నేను నేనుగా బ్రతకాలిగాని, ఫలానా వారి భార్యగా బ్రతకటం నా కిష్టం లేదు."

"మీరు చెప్పేది నాకు బోధపడటం లేదు."

"పెళ్ళి చేసుకోవటానికి మరో షరతు పెట్టాడు. నేను ఉద్యోగం మానేయాలట. తన భార్య పరాయి పురుషులమధ్య ఉద్యోగం చేయటాన్ని తాను భరించలేడట. ఆ షరతుకు నేను ఒప్పుకోలేదు."

"ఐసీ" అన్నాడు దేవ్ తల ఆడిస్తూ.

సునీత గదిలోంచి వెళ్ళిపోయింది.

ఆమె రోజూ ఆఫీసుకు వస్తూనే ఉంది. తన పని తాను చేసుకుంటూనే వుంది. అవసరం వుంటే దేవ్ గదికి వస్తుంది. దేవ్ కూడా ఉద్యోగరీత్యానే ఆమెతో మాట్లాడటం జరుగుతూన్నది. కాని రోజులు గడిచినకొద్దీ ఆమె మీద సానుభూతి పెరగజొచ్చింది.

ఆమె అట్లా ఒంటరిగానే వుండిపోతుందా? ఆమెకు జరిగిన అన్యాయానికి, ఆ అన్యాయానికి కారకుడైన తను ఆమెకు ఏమీచేయలేడా? ఆమె కోరుకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ఆమె బ్రతుక్కు ఒకతోడు తాను కల్పించలేడా? ఆమె అందమైంది; లావణ్యవతి; చదువుకున్నది; సంస్కారంగలది; సహృదయవతి. ఆమెను తాను పెళ్ళిచేసుకుంటే!...

ఒక రోజు రాత్రి దేవ్ ఆలోచనలు ఆ విధంగా కొనసాగి, ఓ దృఢ నిర్ణయాని కొచ్చాడు. ఆమె అభిప్రాయాన్ని కనుక్కోవాలనుకున్నాడు.

అయితే ఆ మరురోజు సునీత ఆఫీసుకు రాలేదు. వారం రోజులు సెలవు పెట్టింది. ఆ వారాన్ని మరో వారానికి పొడిగించింది.

దేవ్ ఆందోళన పడ్డాడు. ఆచూకీ తీయగా లంగ్ కేన్సర్ వచ్చి, ఆమె కేన్సర్ హాస్పటల్లో వున్నట్టు తెల్సింది. ఆరోజు సాయంత్రమే అక్కడికెళ్లాడు దేవ్.

చిక్కి శల్యమై, మంచానికి అంటుకుపోయిన సునీత అతన్ని చూడగానే మహా సంతోషంతో లేచి కూర్చుని నమస్కారం చేసింది. ఆమెను చూడగానే దేవ్ మనస్సు విలవిల్లాడింది. శరీరంలోని నరాలన్నీ బాధతో మూలిగాయి. కళ్ళల్లో నీళ్ళు తొంగిచూశాయి. కొన్ని క్షణాలపాటు ఆమె దీనస్థితిని చూస్తూ నిల్చుండిపోయాడు.

ఆమెకు సపర్యలు చేస్తూ ఆమె మంచం పక్కనే తల్లి కూర్చుందీ, శోకమూర్తియై.

దగ్గర్లోవున్న ఇనుప కుర్చీ పై కూర్చున్నాడు దేవ్.

"భగవంతుడు కొంతమందిని బ్రతుకుతో పోరాటం సాగించటానికి పుట్టిస్తాడు. అలా పుట్టినవాళ్ళకు ఆత్మబలం ఎంతవున్నా, కర్మఫలానికి దాసోహమనక తప్పదు. అందుకు నా బ్రతుకే ప్రత్యక్ష సాక్ష్యం. నా జీవితం రోజుల్లో పడింది. రోజుల్నుంచి గంటలూ, నిముషాలూ, సెకండ్లలో పడటానికి ఎక్కువకాలం పట్టదని కూడా నాకు తెలుసు. నా బ్రతుకు చుట్టూ నేను ఏర్పర్చుకున్న అగ్నివలయాన్ని అధిగమించటానికి ఇద్దరు యువకులు పిరికిగా ప్రయత్నించారు. కానీ ఈ పరిణామమే ఈ చివరిదశలో నా ఆత్మకు ఎక్కువ తృప్తిని కలిగిస్తోంది" అందామె.

దేవ్ ఏం మాట్లాడలేకపోయాడు.

సునీత తల్లి ఫ్లాస్కులో టీని ఓ కప్పులో పోసి దేవ్‌కు ఇచ్చింది.

సునీతకేసి చూశాడు దేవ్ దిగులుతో బరువెక్కిన మొహంతో.

"తీసుకోండి! తేనీరుకూ, కన్నీరుకూ సంబంధ మున్నదని ఇదివరకు మీరే అన్నారు" అంది సునీత పేలవమైన చిరునవ్వుతో.

ఆ టీ కప్పు అందుకొని, టీని సిప్ చేయబోతుండగా—అతని కళ్ళనుంచి హఠాత్తుగా రెండు కన్నీటిబొట్లు రాలి అందులో పడ్డాయి.